ప్రజాశక్తి
సోమవారం 10 ఫిబ్రవరి 2025

ఏజెన్సీ బంద్‌కు యుటిఎఫ్ మద్దతు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టాన్ని సవరించాలని కోరుతూ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఈనెల 11,12 తేదీల్లో నిర్వహించనున్న ఏజెన్సీ బంద్‌కు మద్దతు తెలుపుతున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌రావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తోట రమేష్, కె.భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే జీవో 3 రద్దు వల్ల గిరిజన యువత తీవ్రంగా నష్టపోయిందని, ఏజెన్సీ ప్రాంతానికి రక్షణ కవచంలా ఉన్న 1/70 చట్టాన్ని సవరిస్తే గిరిజనుల భూములు అన్యాక్రాంతమవుతాయని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ఏజెన్సీ బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు వారు ఆ ప్రకటనలో తెలిపారు.

కనుమరుగవుతున్న జిసిసి

- శిథిలావస్థలో జిసిసి
- డిఆర్ డిపోలో ఏళ్ల తరబడి భర్తీకాని పోస్టులు

ప్రజాశక్తి -సీతంపేట

గిరిజన సహకార సంస్థ రోజు రోజుకు కనుమరుగవుతుంది. ఒకప్పుడు గిరిజన సహకార సంస్థకు ఒక ప్రత్యేకగా గుర్తింపు ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వం చేసిన ప్రతి కార్యక్రమాల్లో జిసిసిని భాగస్వామ్యం చేసేవారు. ప్రస్తుతం అంతంత మాత్రంగా వ్యవహరిస్తున్నారు. ఏళ్ల తరబడి ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఉన్న సిబ్బందితోనే జిసిసి కార్యకలాపాలు నెట్టుకొస్తున్నారు.

గిరిజనులకు నిత్యావసర సరుకులు తక్కువ ధరకు నాణ్యమైన వస్తువుల గిరిజన గ్రామాల్లోని గిరిజనులకు చెంతకు చేరువ చేయాలని ఉద్దేశంతో 1956లో గిరిజన సహకార సంస్థను నెలకొల్పారు. అప్పటి నుంచి గిరిజన సహకార సంస్థ డిఆర్ డిపోలో నిర్విఘ్న క్రయ విక్రయ చేయడానికి సేల్స్‌మేన్లను నియమించారు. అంతవరకు బాగానే ఉంది. ప్రస్తుతం సేల్స్‌మెన్స్, అధికారులు, నాలుగో తరగతి సిబ్బంది, రిటైర్మెంట్ అయిన ఆ పోస్టులు ఏళ్ల తరబడి ఖాళీ అయినా భర్తీ చేసిన దాఖలాల్లేవు. రిటైర్మెంట్ అయిన పోస్ట్‌ను ఇంకొకరికి అదనపు బాధ్యతలు అప్పగించడం తప్ప కొత్తగా వేరే వారిని నియమించడంలేదు. అదేవిధంగా సీతంపేట డివిజనల్ పరిధిలోని సీతంపేట, పాతపట్నం జిసిసి బ్రాంచ్‌లు ఉన్నాయి. సీతంపేట బ్రాంచ్ పరిధిలో 36 డిఆర్ డిపోలు ఉన్నాయి. వీటిలో 14 కొత్త భవనాలు కావాలని ప్రతిపాదన పంపించారు. 5 డిఆర్ డిపోలు మరమ్మతులకు గురయ్యాయి. ఐదు గోదాములు కూడా మరమ్మతులకు గురయ్యాయి. ఈ బ్రాంచ్ పరిధిలో 22,856 రేషన్ కార్డులు లబ్ధిదారులకు 4,850 క్వింటాలు బియ్యం, 145క్వింటాల్ పంచదార, కందిపప్పు డిపోల ద్వారా సరఫరా చేస్తారు. డిపోలు శిథిలావస్థలో ఉండడంతో ఎక్కడ సరుకులు నిల్వలు ఉంచాలో తెలియని పరిస్థితి ఉంది. అదేవిధంగా పాతపట్నం బ్రాంచ్ పరిధిలో 21 డిఆర్ డిపోలకు 21 మరమ్మతులకు గురయ్యాయి. ఆరు డిపోలు పూర్తిగా శిథిలావస్థ శిథిలావస్థలో ఉండడంతో పెచ్చులు ఊడిపోతున్నాయి. దీంతో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు చిన్నది నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో నీరు కారడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పాతపట్నం బ్రాంచ్ పరిధిలో 8,630 రేషన్ కార్డులకు 43,150 క్వింటాళ్ల బియ్యం డిఆర్ డిపోల్లో నిల్వ ఉంచి లబ్ధిదారులకు అందజేస్తారు. దీంతో ఈ సరుకు వర్షాకాలంలో పాడైపోతుందని ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేసి నిల్వచేసే గోధుమలు లేక బయట ఉంచాల్సిన పరిస్థితి దాపురించింది. అదేవిధంగా ఏళ్ల తరబడి జిసిసి అధికార సిబ్బంది పోస్టులు భర్తీ చేయడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మేనేజర్లు, అకౌంటెంట్లు, డిఎంలు, జనరల్ మేనేజర్లు అన్ని కలిపి 1088 పోస్టులు ఖాళీలు ఉంటే కేవలం 210 మందితోనే నెట్టుకు వస్తున్నారు. ఇప్పటికే సీతంపేట డిఎం, మేనేజర్లు, అకౌంటెంట్, సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్, సేల్స్ మెన్స్, నాలుగో తరగతి సిబ్బంది ఇలా అన్ని పోస్టులు ఇన్‌ఛార్జిలతో నెట్టుకొస్తున్నారు.

శిథిలావస్థలో ఉన్న సామరెల్లి డిఆర్ డిపో

ప్రతిపాదనలు పంపించాం

గిరిజన సహకార సంస్థ ఖాళీగా ఉన్న పోస్టులకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. డిఆర్ డిపోలు మేనేజర్ డిఎం కార్యాలయాలు కూడా ప్రతిపాదనలో పంపించాం. డిపోలో మేజర్ గదులు ముందుగా మరమ్మతులు చేయిస్తాం. కొత్త భవనాలకు ప్రతిపాదనలు పంపించాం.

జి.సంధ్యారాణి,
జిసిసి జనరల్ మేనేజర్, విశాఖపట్నం.

తాగునీటి సమస్య తలెత్తొద్దు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

రానున్న వేసవిలో జిల్లాలోని ప్రజలకు ఎలాంటి తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గ్రామీణ నీటిపారుదశాలఖ అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి జిల్లా యంత్రాంగం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలపై కలెక్టర్ సంబంధిత ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గతంలోని అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, ముఖ్యంగా గిరి శిఖరం ప్రాంతాల్లోని సమస్యను ఎదుర్కోవడానికి అన్ని చర్యలూ తీసుకోవాలని అన్నారు. బోరు బావుల ఫ్లషింగ్, ఇతర నిర్వహణ పనులు ముందుగానే చేపట్టాలన్నారు. జల్‌జీవన్ మిషన్ (జెజెఎం) కింద అనేక ఆవాసాలకు తాగునీరందించడం జరిగిందని, మిగిలిన ఆవాసాలపై దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. సమస్యను పరిష్కరించడానికి ఐటిడిఎలు కోటి రూపాయల వరకు నిధులు అందించాలని కలెక్టర్ అన్నారు. వేసవి ప్రభావం ప్రారంభమై ఒదని, మే, జూన్‌లో భూగర్భ జలాలు అడుగంటిపోవడం వంటి అంశాలు కారణంగా నీటి ఎద్దడి ఎక్కువ ఉండే అవకాశం ఉందని, కావున పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమ్మర్ క్రాష్ కార్యక్రమాన్ని మార్చి 15 వరకు చేపట్టాలని ఆయన ఆదేశించారు. పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎంపిపి నిధుల నుంచి రూ.75 లక్షలతో 15 మండలాల్లో మొత్తం 7217 చేతి పంపుల మరమ్మతులు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్యలపై సమాచారం స్వీకరించి వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక సెల్‌ను ప్రారంభించాలని తెలిపారు. అన్ని సమస్యలను పోర్టల్‌లో నమోదు చేయాలని ఆయన తెలిపారు. మున్సిపల్ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని చెప్పారు. జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు మాట్లాడుతూ జిల్లా 187 ఆవాసాలను తాగునీటి ఎద్దడి ఉన్న ఆవాసాలుగా గుర్తించామని, వీటికి గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.5.16 కోట్లతో అంచనాలు సిద్ధం చేశామని తెలిపారు. జెడ్పీ నిధులతో రూ.2.20 కోట్లతో 73 పనులు చేపట్టనున్నట్లు వివరించారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న 104 ఉద్యోగులు

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - సాలూరు

నిరంతరం ప్రజల సేవలో తరిస్తున్న 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు కోరారు. ఆదివారం పట్టణంలోని వెంకటేశ్వర కల్యాణమండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 104 ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డర్రు ఆనందరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మన్మధ రావు మాట్లాడుతూ జిల్లాలో 64 మంది 104 డ్రైవర్లు, డిఇఒలు పనిచేస్తున్నారని చెప్పారు. నిరంతరం వీరు ప్రజలకు సేవ చేస్తూ ప్రభుత్వానికి వారిధిగా ఉంటూ కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువస్తున్నారని చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకొని భావిస్తున్న తరుణంలో ఇస్తున్న అరకొర జీవితంలో రూ.1000 కోత పెట్టడం న్యాయం కాదన్నారు. ప్రభుత్వం ఆలోచించి సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా తయారు చేసిన ఆర్‌ఎఫ్‌పిలో డిఇఒల జీతభత్యాలు విషయంలో ఎలాంటి మార్పు జరగలేదని, అదేవిధంగా శ్లాబ్ విషయంలో స్పష్టత లేదని చెప్పారు. పిఎఫ్, ఇఎస్‌ఐ విషయంలో కూడా స్పష్టత లేదని, అంతిమంగా సిటిసి అనే పదాన్ని పెట్టడం వల్ల యాజమాన్యాలు ఉద్యోగులకు తీవ్ర నష్టాన్ని కలుగచేస్తున్నాయని చెప్పారు. 104 లో పనిచేస్తున్న డిఇఒ, డ్రైవర్లందరికీ శ్లాబ్ అమలు చేయాలని, శ్లాబ్ ఆటోమేటిగ్గా అమలయ్యేలా ఆర్‌ఎఫ్‌పిలో పొందుపర్చాలని కోరారు. 104లో సిటిసి విధానాన్ని రద్దుచేసి ఇపిఎఫ్‌లో యాజమాన్యం వాటా యాజమాన్యమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇఎస్‌ఐ అనేది ఆర్‌ఎఫ్‌పిలో పొందుపర్చాలని కోరారు. 104 ఉద్యోగులందరికీ వెయిటేజ్ మార్కులు ఇవ్వాలని, ప్రభుత్వ నియమకాల్లో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. 104 లో పనిచేస్తున్న ఉద్యోగులకు గతంలో మాదిరి ఫుడ్ అలవెన్స్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కోశాధికారి జగదీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామి నాయుడు, వైస్ ప్రెసిడెంట్ కాశీ విశ్వేశ్వరరావు, పృధ్వీ, ఉదయ్, సుభాని, హరి గోపాల్, కూర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

'వెలుగు'కు నీడ కరువు

- ఆరుబయట ఆత్మగౌరవం
- ఆరంభంలోనే ఆగిపోయిన స్త్రీశక్తి భవనం

ప్రజాశక్తి - గరుగుబిల్లి



స్థానిక వెలుగు సిబ్బందికి సొంత భవనం లేకపోవడంతో అద్దెకొంపలో విధులు నిర్వహిస్తున్నారు. ఇదికూడా చిన్నది కావడంతో సమావేశాలను పరాయి పంచన నిర్వహిస్తున్నారు. ఇది కూడా చిన్నది కావడంతో ఆరుబయట సమావేశాలు నిర్వహించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలో 1313 మహిళా సంఘాలు ఉండగా అందులో 15,287 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఈ సంఘాలకు 39 మంది విఒఎలు ఉన్నారు. 2011లో అప్పటి ప్రభుత్వం స్త్రీశక్తి భవన నిర్మాణానికి రూ.25లక్షలు మంజూరు చేసింది. అయితే ఆదిలోనే పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకూ సిబ్బంది అద్దెకొంపలోనే విధులు నిర్వహిస్తున్నారు.

మహిళా అభివృద్ధి కి ప్రభుత్వం ఇచ్చే ప్రతి రూపాయి ఈ కేంద్రం ద్వారా మహిళలు అందుతాయి. అయితే మహిళా సంఘాలకు అవగాహన పర్చే విషయంలో వెలుగు కేంద్రం ఏర్పాటు చేసే ప్రతి మీటింగుకు సంఘ సభ్యులు ఎక్కువ సంఖ్యలో మహిళలు వస్తూ ఉంటారు. దీంతో కార్యాలయంలో చిన్నది కావడంతో ఎదురుగా ఉండే సాయిబాబా మందిరంలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. కనీసం వీరు కాలకృత్యాలు తీర్చుకునేందుకు కూడా ఎటువంటి సదుపాయం లేక తీవ్ర అవస్థలుపడుతున్నారు. ఈ కార్యాలయంలో ఒకే ఒక్క మరుగుదొడ్డు ఉండడం, అది కేవలం సిబ్బందికే తప్ప సమావేశాలకు వచ్చే మహిళలకు అవకాశం లేదు. దీంతో మహిళలు ఆరుబయటే కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అద్దె కొంపకు ఇచ్చే డబ్బులతో కొత్త భవనం నిర్మిస్తే బాగుంటుందని పలువురు మహిళలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తక్షణమే స్త్రీ భవనాన్ని నిర్మించాలని కోరుతున్నారు.

సమావేశంలో పాల్గొన్న గిరిజన, రైతు, వామపక్ష ప్రజాసంఘాల నాయకులు

ఏజెన్సీ బంద్‌కు సహకరించండి

గిరిజన, రైతు కూలీ, ప్రజాసంఘాల పిలుపు

ప్రజాశక్తి - పార్వతీపురం

1/70 చట్టాన్ని సవరించాలంటూ స్పీకర్ అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మన్యం జిల్లాలో ఈనెల 11,12న జరగనున్న ఏజెన్సీ బంద్‌ను అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని గిరిజన, రైతు కూలీ, వామపక్ష ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఐఎఫ్‌టియు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1/70చట్టం సవరణ చేయాలనే వ్యాఖ్యలు, ఆలోచన కేవలం అయ్యన పాత్రుడు ది మాత్రమే కాదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదని అన్నారు. బంద్‌కు వాణిజ్య, వర్తక సంఘాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. 11న జిల్లా వ్యాప్తంగా బైక్ ర్యాలీ, ప్రచారం, ప్రదర్శనలు, 12 బంద్ ఉంటుందని ప్రకటించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు మెరగాని గోపాలం, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు బొత్స నర్సింగరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కూరంగి సీతారాం, ఐఎఫ్‌టియు నాయకులు ఆర్.సర్వేశ్వరావు, సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలమాంబ హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్ర గిరిజన జాతరగా మార్పు చెందిన పోలమాంబ అమ్మవారి హుండీలను సోమవారం లెక్కించనున్నట్లు ఆలయ ఇఒ వివి సూర్యనారాయణ తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనదలిచే ఔత్సాహిక సేవకులు ఉదయం 9 గంటలకు చదురు గుడి వద్దకు హాజరుకావాలని కోరారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, మండల స్థాయి అధికారులు పోలీసుల సమక్షంలో ఈ కార్యక్రమం జరగనుందని ఆయన తెలిపారు

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి-బొబ్బిలి

తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి తెలిపారు. ఆదివారం బొబ్బిలి పట్టణంలో ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. మూడు దశాబ్దాల నుంచి విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తున్నాన న్నారు. ప్రాథమిక పాఠశాల నుంచి యూనివర్సిటీ వరకు విద్యారంగ, ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ప్రొఫెసర్ల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. ఇప్పటికే ఆయా సమస్యల పరిష్కారానికి పోరాటం చేశానని, ఎమ్మెల్సీగా గెలిపిస్తే మండలిలో గళం వినిపిస్తానని చెప్పారు. ప్రయివేట్ విద్యాసంస్థలో పని చేస్తున్న ఉపాధ్యాయులు, లెక్చరర్లకు సంక్షేమ నిధి కేటాయించాలని, హెల్త్ కార్డులు మంజూరు చేసి రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా వర్తింపజేయాలని, గుర్తింపు కార్డులు మంజూరు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇవ్వాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కృషిచేస్తానన్నారు. పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఆమె ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ప్రొఫెసర్లను కోరారు. ఆమెతో యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, కేశవరావు ఉన్నారు.

మాట్లాడుతున్న పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

వ్యాన్‌ని వదిలేసిన కొటియా పోలీసులు

ప్రజాశక్తి - సాలూరు

వివాదాస్పద కొటియా గ్రామమైన దూళిభద్ర వాటర్ ట్యాంక్ నిర్మాణ సామగ్రిని, వ్యాన్‌తో సహా తీసుకెళ్లిన ఒడిశా పోలీసులు శనివారం రాత్రి 10గంటలకు విడిచిపెట్టారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో దూళిభద్రలో జలజీవన్ మిషన్ కింద వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు జరుగుతుండగా పొట్టంగి రెవెన్యూ అధికారులు, కొటియా పోలీసులు అక్కడికి చేరుకుని వ్యాన్‌తో సహా నిర్మాణ సామగ్రిని తీసుకెళ్లారు. గంజాయిభద్ర మాజీ సర్పంచ్ గెమ్మెల భీషు కొటియా పోలీసులతో మాట్లాడడంతో ఆయన పూచీకత్తుపై వ్యాన్‌ను విడిచి పెట్టారు. దీంతో వాహనం డ్రైవర్, కాంట్రాక్టర్ ఊపిరి పీల్చుకున్నారు.

అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్‌లో అధికారులే క్రియాశీలకం

ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు

ప్రజాశక్తి - కురుపాం

అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్ అనుసంధానానికి స్థానిక అధికారులు క్రియాశీలకంగా వ్యవహరించి గిరిజనుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎస్టీ కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు అన్నారు. మండలంలోని బియ్యాలవలస పంచాయతీ మంత్రజోలలో గల వన్ ధన్ వికాస కేంద్రాన్ని (విడివికె) ఆదివారం ఆయన సందర్శించారు. అక్కడ వెలుగు ద్వారా గిరిజన మహిళలకు చిరుధాన్యాలతో బిస్కెట్లు తయారీ మిల్లును పరిశీలించారు. వారు తయారు చేస్తున్న విధానం, కావాల్సిన ముడి సరుకులు, వారికి వచ్చే ఆదాయం గూర్చి నేరుగా మహిళలతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వన్ దన్ వికాస్ కేంద్రం అనేది మంచి కార్యక్రమని, దీనికి కేంద్ర ప్రభుత్వం ఆసరా ఇస్తుందని తెలిపారు. ఆదివాసీ ప్రాంతాల్లో పండే పంటలతో గిరిజన మహిళలు ఉత్పత్తులను తయారు చేసి ఆర్థిక స్వాలంబన పొందడమే దీని ముఖ్యోద్దేశమన్నారు. ఇక్కడ బిస్కెట్లు తయారు బాగానే చేస్తున్నారని, అయితే వీటికి సరైన మార్కెటింగ్ చేయలేకపోతున్నారని అన్నారు. కావున బిస్కెట్లను గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు కొనుగోలు చేసి విద్యార్థులకు అందించేలా చర్యలు చేపడతానని, దీనివల్ల విద్యార్థులకు కూడా పౌష్టికాహారం అందుతుందన్నారు. చిరుధాన్యాలు ఆడుతున్న మిల్లులకు రేకుల షెడ్డు పాడైపోయిందని చైర్మన్ దృష్టికి మహిళ తీసుకెళ్లారు. రేకులు ప్రభుత్వం అందిస్తే స్వచ్ఛందంగా శ్రమదానంతో నిర్మించుకుంటామని వారు తెలిపారు. ఆ సమస్య అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని చైర్మన్ హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో పండే జీడి, కొండ, చీపుర్లు, తేనె, కరకకాయలు తదితర పంటలను ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, స్థానిక గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

గిరిజనుల భాగస్వామ్యంతోనే టూరిజం అభివృద్ధి చేపట్టాలి

గుమ్మలక్ష్మీపురం : షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనుల భాగస్వామ్యంతోనే పర్యాటక అభివృద్ధి చేపట్టాలని ఎస్టీ కమిషన్ చైర్మన్ డివిజన్ శంకర్రావు అభిప్రాయపడ్డారు.

గిరిజన మహిళలు తయారు చేసిన బిస్కెట్లును పరిశీలిస్తున్న శంకరరావు

గుమ్మలక్ష్మీపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 1/ 70 చట్టం గిరిజనులకు ఎంతగానో మేలు చేస్తుందని, ఈ చట్టాన్ని పూర్తిగా అమలు చేస్తూ టూరిజం అభివృద్ధి చేపట్టాలన్నారు. షెడ్యూల్డ్ గిరిజన ప్రాంతమైన గుమ్మలక్ష్మీపురం కేంద్రంగా జీడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, గిరిజన రైతులకు గిట్టుబాటు ధరతో పాటు యువతకు ఉపాధి దొరుకుతుందని అన్నారు. గిరిజన యువత భవిష్యత్తులో ఉపాధి, ఉద్యోగాలకు ఉపయోగపడే కోర్సులు చదువుకోవాలన్నారు. రైల్వే రిక్రూట్మెంట్, బ్యాంకింగ్ సర్వీస్, స్టాఫ్ సెలక్షన్ కమిటీ, ఎపిపిఎస్‌సి తదితర ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకొని కష్టపడి చదివినప్పుడే రిజర్వేషన్ ఉపయోగపడుతూ మంచి ఫలితాలు వస్తాయని ఆయన అన్నారు. ప్రైవేట్ సెక్టార్‌లో కూడా పలు అవకాశాలు ఉన్నాయన్నారు. కావున గిరిజన యువత క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదవాలని హితవు పలికారు.

అభివృద్ధి పనులను అడ్డుకోవడం దారుణం

ఒడిశా పోలీసుల తీరుపై ఆదివాసీ గిరిజన సంఘం ఆందోళన

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఆంధ్రా - ఒడిశా సరిహద్దు గ్రామాల్లో ఎపి ప్రభుత్వం నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను ప్రతిసారీ అడ్డుకోవడం ఒడిశా పోలీసులకు మంచి పద్ధతి కాదని దీన్ని నివారించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం ఎంతవరకు సబబు అని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఆక్షేపించారు. శనివారం జరిగిన ఒడిశా పోలీసుల దౌర్జన్యానికి నిరసనగా ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ధూళిభద్రలో ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి గేమ్మెల జానకీరావు మాట్లాడుతూ కొఠియా సరిహద్దు గ్రామాల గిరిజనులపై ఒడిశా ప్రభుత్వం దాడులు చేయడం, వేధింపులకు దిగడం, గ్రామాభివృద్ధి పనుల సామాగ్రిని ఎత్తుకెళ్లడం, గిరిజన కూలీలను నిర్బంధించడం సరికాదని, ఒడిశా అధికారులు తీరు మార్చుకోవాలని హితావు పలికారు. గతంలో దిగువ శింబి అంగన్వాడీ కేంద్రంపై దాడి చేసి అక్కడున్న సామాగ్రిని ఎత్తుకెళ్లారని, మళ్లీ శనివారం దూళిభద్రలో రక్షిత మంచినీరు పథకం కింద నిర్వహిస్తున్న వాటర్ ట్యాంక్ సామాగ్రిని, సామాగ్రిని తెచ్చిన బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకోవడం, పనులకు వచ్చిన కూలీల వద్ద సెల్ ఫోన్‌లను ఎత్తుకెళ్లి వారిని పోలీస్ స్టేషన్లో నిర్బంధించడం ఒడిశా పోలీసుల దుశ్చర్యలకు నిదర్శమన్నారు. గిరిశిఖర గ్రామాల్లో అభివృద్ధి పనులపై, స్థానిక గిరిజనులను ఇబ్బందులు పెడుతున్నా ఎపి ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడం సరికాదని తెలిపారు. ఒడిశా ప్రభుత్వం, అధికారులు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉల్లంఘించి గిరిజనులపై దాడులు చేస్తూ, జరుగుతున్న అభివృద్ధి పనులను అడ్డుకుంటే గిరిజనులకు రక్షణగా ఉండాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ విషయంపై వెంటనే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని కోటియా సరిహద్దు గ్రామాల సమస్యను పరిష్కరించాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా ఇరు రాష్ట్రాల గిరిజనులకు రక్షణగా ఉండాలని డిమాండ్ చేశారు. లేనిచో గిరిజనులందర్నీ సమీకరణ చేసి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. నిరసనలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు తాడంగి సన్నం, చోడిపల్లి రాజు, సుబ్బారావు, బిరుసు, సరుబు, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న గిరిజన యువతకులు

కోడూరుకు బంగారు నంది ప్రదానం

ప్రజాశక్తి - సాలూరు

శ్రీనివాసరావును అభినందిస్తున్న పట్టణ ప్రముఖులు

మూడు దశాబ్దాలుగా విద్యారంగంలో విశేష సేవలు అందిస్తున్న శ్రీ వెంకట విద్యా గిరి పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావుకు తెలంగాణా కళారత్నాలు సాంస్కృతిక సంస్థ జాతీయ బంగారు నంది అవార్డును ప్రదానం చేసింది. హైదరాబాద్‌లోని త్యాగరాజ భవన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జె.జగదీశ్వరరావు చేతుల మీదుగా కోడూరు సాయి శ్రీనివాసరావు అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో తెలుగు కళారత్నాలు సంస్థ సిఇఒ బి.నర్సింగరావు, తెలంగాణ సాంస్కృతిక సంస్థ డైరెక్టర్ డి.ఉషారాణి పాల్గొన్నారు. సాయి శ్రీనివాసరావుకు అవార్డు లభించడంపై డిప్యూటీ డిఇఒ రాజ్‌కుమార్, ప్రముఖ వైద్యులు డాక్టర్ వి.గణేశ్వరరావు, ఉపాధ్యాయులు వైదేహి కృష్ణారావు, అర్బన్ బ్యాంక్ మాజీ అధ్యక్షులు కూనిశెట్టి భీమారావు, బ్యాంక్ కార్యదర్శి బి.వేణుగోపాలరావు హర్షం వ్యక్తంచేశారు.

రావాడ జంక్షన్ వద్ద పారిశుధ్య పనులు చేయిస్తున్న కోటేశ్వరరావు

అంధవరపు ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మేజర్ పంచాయతీలో ఆదివారం మాజీ జెడ్పిటిసి సభ్యులు అంధవరపు కోటేశ్వరరావు స్వచ్ఛందంగా తన సొంత నిధులతో పారిశుధ్య పనులను చేపట్టారు. పంచాయతీ కేంద్రంలో గల న్యూకాలనీ నుంచి రావాడ జంక్షన్ వరకు రహదారికి ఇరువైపులా ఉన్న చెత్తాచెదారాలను తొలగించారు. పదవులతో సంబంధం లేకుండా నిరంతరం పంచాయతీని పర్యవేక్షిస్తూ ఎక్కడ ఎటువంటి పారిశుధ్య లోపం ఉన్నా వెంటనే స్పందించి స్వచ్ఛందంగా తన సొంత నిధులు పెట్టి తొలగిస్తుండడం ఆయనకు అలవాటుగా మారింది. అంతేకాకుండా ఆపదలో ఉన్నామని పేదలు తన వద్దకు వెళ్తే వెంటనే ఆయన తోచిన సహాయం చేసే వ్యక్తిగా పేద ప్రజల మన్నలను పొందుతుంటారు.

అంగన్వాడీ కేంద్రం చుట్టూ రక్షణగా కర్రల దడి

అంగన్వాడీ కేంద్రానికి రక్షణగోడ నిర్మించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని డుమ్మంగి అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అంగన్వాడీ కేంద్రానికి భవన నిర్మాణం చేపట్టినా ప్రహరీ నిర్మించకపోవడంతో విషసర్పాలు చొరబడే అవకాశం ఉందని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి అంగన్వాడీ కేంద్రం చుట్టూ కర్రలతో దడి నిర్మించారు. అంగన్వాడీ కేంద్రంలో ఉన్న బోరు పాడైపోవడంతో నీటి సమస్య అధికంగా ఉందని, నీటి కోసం గ్రామంలోకి వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. విద్యార్థులకు ఆట స్థలం కూడా లేదన్నారు. అధికారులు స్పందించి సౌకర్యాలు మెరుగుపరచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తెట్టంగిలో మహాలక్ష్మి పేరంటాలు ఉత్సవం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తెట్టంగిలో ఆదివారం నుంచి మంగళవారం వరకు 48వ వార్షికోత్సవ మహాలక్ష్మి పేరంటాలు మహోత్సవ నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు గుజ్జల నారాయణరావు- జయలక్ష్మి దంపతులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా ఈనెల 10న విజయనగరానికి చెందిన శ్రీసూర్య బుర్రకథ బృందం ప్రియ ట్రూప్ వారిచే శ్రీ సీతారామ కల్యాణం బుర్రకథ, 11న లక్ష్మీనారాయణ కళ్యాణ మహోత్సవం, అదే రోజు రాత్రి విజయవాడకు చెందిన జూనియర్ జయరాజ్ రాజన్న భక్త చింతామణి నాటకం నిర్వహించనున్నట్టు తెలిపారు. అలాగే 1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు వివిధ రకాలైన క్విజ్ పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

వార్డుల్లో చైర్మన్ పర్యటన

ప్రజాశక్తి - పాలకొండ

నగర పంచాయతీలోని పలు వార్డుల్లో ఆదివారం నగర పంచాయతీ చైర్మన్ పల్లా ప్రతాప్ పర్యటించారు. నీళ్ల ట్యాంక్ వీధిని సందర్శించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ప్రజలతో మాట్లాడి వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. అదేవిధంగా పెద్దకాపు వీధిలో అన్నదాన కార్యక్రమం జరుగుతుండడంతో అక్కడికి వెళ్లి స్థానికులతో మాట్లాడారు.

మద్యం షాపు లాటరీ వాయిదా

ప్రజాశక్తి - సీతానగరం

కల్లుగీత కార్మికులకు కేటాయించిన మద్యం షాపుల లాటరీ ఈనెల 10న జరగాల్సి ఉండగా వాయిదా పడినట్లు సీతానగరం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఇన్‌స్పెక్టర్ పి.పద్మావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున లాటరీ వాయిదా పడినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ వేసిన తర్వాత తేదీని ప్రకటిస్తామని ఆమె తెలిపారు.

చురుగ్గా పిఎంశ్రీ భవనం పనులు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (బాలుర) ఆవరణలో నిర్మిస్తున్న పిఎం శ్రీ భవనం పనులు చురుగ్గా సాగుతున్నాయి. సుమారు రూ.15.48 లక్షల అంచనా వ్యయంతో ఈ పనులు చేపడుతున్నారు. ఈ భవనం పూర్తయితే విద్యార్థులకు కొంతమేర మెరుగైన సాంకేతిక విద్య అందించే అవకాశం ఉంటుందని, స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - సీతంపేట

రైతు విశిష్ట సంఖ్య నమోదు ఫార్మర్ రిజిస్టలో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి.శ్రీదేవి తెలిపారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ డిజిటలైజేషన్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఐడి ఆధార్ తరహాలో రైతులకు అందిస్తుందని తెలిపారు. ఈ నెలాఖరు లోపల అందరూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ప్రతి రైతు ఐడి నెంబర్ పొందాలన్నారు. మీ పరిధిలోని రైతుసేవా కేంద్రంలో కానీ, మీ గ్రామ వ్యవసాయ సహాయకులని కానీ సంప్రదించాలని కోరారు.

హద్దు మీరి విమర్శలు తగదు

మంత్రి అహంకారం తగ్గించుకోవాలి
సంధ్యారాణి పై మాజీ డిప్యూటీ సిఎం ఫైర్

ప్రజాశక్తి - సాలూరు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజన్నదొర

వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డిపై హద్దు మీరి విమర్శలు చేయడం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి తగదని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర హితవు పలికారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధ్యత గల మంత్రి పదవిలో ఉన్నప్పుడు ఏం మాట్లాడుతున్నామో ఆలోచించి మాట్లాడాలని అన్నారు. మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డిని విమర్శించే స్థాయి సంధ్యారాణికి లేదన్నారు. ప్రతిపక్ష పార్టీ నేతగా, మాజీ సిఎంగా జగన్ మోహన్ రెడ్డి గత ఎనిమిది నెలల కాలంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపారని చెప్పారు. ఎన్నికల ముందు టిడిపి కూటమి పార్టీలు ఇచ్చిన హామీల అమలు గురించి ప్రశ్నించారని చెప్పారు. సూపర్ సిక్స్ హామీల అమలు గురించి ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికీ వుందన్నారు. హామీలను అమలు చేయకపోతే కాలర్ పట్టుకుని నిలదీయాలని ఇదే కూటమి పార్టీల నాయకులు ఎన్నికల ప్రచారంలో చెప్పారని గుర్తు చేశారు. అదే సామాన్య ప్రజల తరపున ప్రతిపక్ష నేతగా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే చేతనైతే సమాధానం చెప్పాలి కానీ ఎదురుదాడి చేయడం సరికాదని చెప్పారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఏడాదికి రూ.70వేల కోట్ల చొప్పున సంక్షేమ పథకాల అమలుకు ఖర్చు చేసినట్లు చెప్పారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8నెలల కాలంలో రూ.లక్షా 47 వేల కోట్లు అప్పు చేసినట్లు చెప్పారు. ఇంత అప్పు చేసి సూపర్ సిక్స్ హామీల అమలు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. మంత్రి వర్గంలో ఉన్న మంత్రుల పనితీరుకు సిఎం చంద్రబాబు నాయుడు కేటాయించిన ర్యాంకుతో మతిభ్రమించి మంత్రి సంధ్యారాణి అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని పిస్తోందని చెప్పారు. ప్రజలు వాస్తవాలు గమనిస్తున్నారని, మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై ఒక అంచనాకు వస్తున్నారని చెప్పారు.

నియోజకవర్గ సమస్యలపై మాట్లాడితే మంచిది

మంత్రి సంధ్యారాణి నియోజకవర్గ పరిధిలోని సమస్యల పరిష్కారంపై మాట్లాడితే మంచిదని రాజన్నదొర వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గంలో ఊరూరా తిరిగి ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్ గ్రామాల సమస్య, జీవో నంబర్ 3పై మంత్రి సంధ్యారాణి స్పష్టత ఇవ్వాలని కోరారు. మంత్రి లోకేష్ కూడా ఎన్నికల ప్రచారంలో భాగంగా జీవో నంబర్ 3 పై హామీ ఇచ్చారని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ హామీలను చేర్చి ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. వివాదాస్పద కొటియా గ్రామాల్లో గిరిజనులు గత కొంతకాలంగా భయభ్రాంతులకు గురవుతున్నారని, ఇటీవల దిగువ శెంబి, దూళిభద్ర గ్రామాల్లో ఒడిశా పోలీసులు, అధికారుల దౌర్జన్యం గురించి మంత్రి సంధ్యారాణి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పాచిపెంట మండలంలోని కుడుమూరు భూముల సమస్య పరిష్కారానికి ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. భూసమస్య పరిష్కరించాలని కోరుతూ సిపిఎం నాయకుల ఆధ్వర్యాన గిరిజనులు కలిసినప్పుడు మంత్రి మొకాసాదారులకు మద్దతు గా మాట్లాడారని చెప్పారు. విలేకరుల సమావేశంలో వైసిపి జెసిఎస్ కన్వీనర్ గిరి రఘు, కౌన్సిలర్లు గొర్లి వెంకటరమణ, సింగారపు ఈశ్వరరావు, పట్టణ నాయకులు గిరి చిన్ని దొర, కస్తూరి రామకృష్ణ పాల్గొన్నారు.

హాస్టల్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

నాణ్యమైన భోజనం పెట్టడం లేదు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన బిసి హాస్టల్‌లో నిరసన

ప్రజాశక్తి - సాలూరు

మూడు రోజుల నుండి నాణ్యమైన భోజనం పంపిణీ చేయకపోవడంతో స్థానిక బిసి బాలుర కళాశాల విద్యార్థులు ధర్నా నిర్వహించారు. జావ లాంటి అన్నం పెడుతుండడంతో విద్యార్థులు రోడ్డెక్కారు. ఆదివారం సాయంత్రం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు నాణ్యమైన భోజనం పెట్టాలని ధర్నా చేశారు. ఎంత అడిగినా వర్కర్లు, వార్డెన్ సమాధానం చెప్పకపోవడంతో విద్యార్థులు ధర్నాకి దిగారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజు మాట్లాడుతూ విద్యార్థులకు సరైన భోజనం అందించకపోవడం దారుణమన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా మధ్యలో బిసి సంక్షేమ అధికారితో మాట్లాడగా సోమవారం హాస్టల్‌కు వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్య, మండల ఉపాధ్యక్షులు సహాయ కార్యదర్శి ధనుంజయ్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా రైతు బజార్

పట్టని పాలకులు, అధికారులు

ప్రజాశక్తి - సాలూరురూరల్

లక్షలాది రూపాయలు ప్రజాధనం వెచ్చించి నిర్మించిన అనేక భవనాలను అధికారులు, పాలకులు వినియోగంలోకి తీసుకురాకపోవడంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. ఇందుకు నిదర్శనం పట్టణంలో గల రైతు బజారే.

రైతు బజార్లంటే రైతులు పండించిన కూరగాయలను, పంటలను పట్టణానికి తీసుకొచ్చి అమ్ముకోడానికి వీలుగా దళారీల బారికాకుండా నుంచి గిట్టుబాటు ధర కల్పనతో పాటు ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందించే స్థలాలు. ఇటువంటి రైతు బజార్‌ను సాలూరు పట్టణంలో నిర్మించి స్థానిక రైతులకు మేలుచేసేలా అప్పటి టిడిపి ప్రభుత్వం 2017లో పట్టణంలోని దండిగాం రోడ్డులో లక్షలు విలువైన స్థలంలో సుమారు రూ.20లక్షలు ఖర్చుపెట్టి మార్కెట్ యార్డు నిర్మించారు. దీన్ని ఉద్యాన శాఖ వారు నిర్వహణ బాధ్యత తీసుకున్నారు. కానీ దీన్ని ప్రారంభించకపోవడంతో అప్పటి నుంచి ఇప్పటి వరకూ వృథాగానే పడింది. ప్రభుత్వాలు మారుతున్నా దీన్ని పట్టించుకొనే నాథుడు కరువైయ్యాడు. ఏళ్లు గడుస్తున్నా ఉపయోగం లేకుండా పోయింది. లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు వినియోగానికి రాలేదు. రైతు బజారులో 20 మంది రైతులు వరకు సరుకులు తెచ్చుకొని అమ్మకాలు సాగించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రారంభంలో కొందరు రైతులు మాత్రం ఇక్కడ దుకానాలు ఏర్పాటు చేశారు. అది కొద్ది నెలల మాత్రమే చేశారు. ఆ తర్వాత ఏమైందో గానీ అందరూ మెయిన్ రోడ్డు పక్కనే దుకాణాలు పెట్టుకున్నారు. అసలు తిరకాసు ఇక్కడే ఉంది. పట్టణంలో మెయిన్ రోడ్డులో కూరగాయలు అమ్మకాలు జరిగినట్లు ఇక్కడ జరగకపోవడానికి కారణం మెయిన్ రోడ్డులో ఉన్న కూరగాయల దుకాణాలను తొలగించకుండా కొందరిని రైతు బజార్‌లో పెట్టమన్నారు. ఇక్కడకు కొనుగోలు దారులు రావడానికి దూరం కావడంతో ఇబ్బందులు పడడం ఒక కారణం. మెయిన్ రోడ్డులో దుకాణాలు నిర్వహించే వారిని రైతు బజార్ లో పెట్టుకొనేలా సంబంధిత అధికారులు చేసినట్లయితే ఇటు రైతులకు గిట్టుబాటు ధర వస్తుంది, అటు వినియోగదారులకు తక్కువ ధరకు నాణ్యమైన కూరగాయలు అందుబాటులోకి వస్తాయని ప్రజలు భావిస్తున్నారు.

నిరుపయోగంగా ఉన్న రైతులు బజారు

అసాంఘిక కార్యకలాపాలు నిలయం రైతు బజార్

రైతు బజారు పట్టణానికి కొద్దిగా దూరంగా ఉండడం వల్ల మందు బాబులు సాయంత్రం 6 దాటితే బార్‌గా మార్చేస్తున్నారు. పందులు, పశువులు తిరగడానికి, మల మూత్ర విసర్జనకు దీన్ని వినియోగిస్తున్నారు. అంతేకాక లారీలు, ట్రాక్టర్లు పార్కింగ్ చేసుకోవడానికి ఉపయోగిస్తున్నారు తప్ప ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేకుండా పోతుంది. మార్కెట్ యార్డు, ఉద్యాన శాఖ, మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి దీన్ని ఉపయోగంలోకి తేవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

తోటపల్లిలో ఫరిడవిల్లుతున్న ఆధ్యాత్మిక శోభ

ఎస్‌టి కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకరరావు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

చిన్న తిరుపతిగా పేరుగాంచిన తోటపల్లి వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం మళ్లీ పునర్ వైభవం సంతరించుకుందని ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు అన్నారు. ఇంత తక్కువ వ్యవధిలో ఆలయాన్ని నిర్మించడం ఆనందదాయకమన్నారు. భక్తుల విరాళాలతో తోటపల్లి టెంపుల్స్ డెవలప్మెంట్ సేవా ట్రస్ట్ ఆలయ నిర్మాణానికి పూనుకోవడం, అద్భుతంగా నిర్మించడంతో పూర్వ వైభవాన్ని సంతరించుకుందని అభినందించారు. నిధుల కొరత ఉన్నప్పటికీ చాలా వరకు నిర్మాణాలు చేపట్టడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని అన్నారు. తనవంతుగా దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. దేవాలయ ప్రాంగణంలో జ్ఞాన జ్యోతి, ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం మంచి నిర్ణయమని, ఆధ్యాత్మికతను కలిగించడానికి ఇక్కడ ఏర్పాటు చేసిన గ్రంథాలు ఉపయోగపడి హింస తగ్గి మానవతను పెంచేందుకు ఈ గ్రంథాలయం ఉపకరిస్తుందని తెలిపారు. ఆలయ చరిత్ర, ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణ పనుల గూర్చి ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ డి.పారినాయుడు వివరించారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్ర పుస్తకాన్ని, క్యాలండర్‌ను శంకరరావు అందజేశారు. వీరితో పాటు ఫైనాన్స్ ట్రస్టీ తామాడ దుర్గారావు, అన్న ప్రసాద కమిటీ అధ్యక్షులు మోనంగి ప్రకాశరావు, దేవాలయ మాజీ చైర్మన్ ఆగూరి వైకుంఠరావు, ట్రస్టీలు రథో మాష్టారు, కొండలరావు, గుడ్ల హరి ప్రసాద్, భోగి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణ లబ్ధిదారులకు న్యాయం చేస్తా

ప్రజాశక్తి - పాలకొండ

గృహనిర్మాణ లబ్ధిదారులందరికీ న్యాయం చేస్తామని నగర పంచాయతీ అభివృద్ధి కమిటీ సమన్వయకర్త పల్లా కొండలరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడుకి హౌసింగ్ స్కీమ్ వచ్చేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఈ విషయంలో దళారులని ఆశ్రయించొద్దని, ఎవరు డబ్బులు వసూలు చేసినా తన దృష్టి తీసుకురావాలన్నారు.

ఉద్యోగులను ప్రభుత్వమే నియమించాలి

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను, పనిచేస్తున్న ఉద్యోగస్తులను ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా భర్తీ చేయాలని రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ఎపి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఔట్సోర్సింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్ ఎంప్లాయిస్ జెఎసి డిమాండ్ చేసింది. ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నియామకాలు జరిపితే పారదర్శకత లోపించి, అర్హులై మెరిట్ ఉన్న అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. రాజకీయ ప్రమేయం, ఇతర అనైతిక ప్రభావం పెరుగుతుందన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ సరిగ్గా అమలు కాదని, అందువల్ల, ప్రభుత్వమే నేరుగా నియామక ప్రక్రియ నిర్వహించి నియమించాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రైవేట్ ఏజెన్సీలకు ఔట్సోర్సింగ్ నియమకాలపై పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడిన చరిత్ర ఉందన్నారు. పెద్ద ఎత్తున నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసే దళారులు తయారయ్యారని, నియామకాలలో పారదర్శకత, సామాజిక న్యాయాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ప్రభుత్వం తప్పుకోవడం, ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పడం వల్ల ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు నష్టం తప్ప న్యాయం జరగదని తెలిపారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ముఖ్యమంత్రి ఆలోచించి తమకు న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన క్యాబినెట్ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకొని ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు భరోసా ఇవ్వాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఔట్సోర్సింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్ ఎంప్లాయిస్ జెఎసి అధ్యక్షులు గురు రమేష్, కార్యదర్శి జి సంతోష్ కుమార్, కోశాధికారి ఎ.అనీష్ కుమార్ కోరారు.

పెదపెంకిలో మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - బలిజిపేట

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు

మండలంలోని పెదపెంకిలో ఆదివారం మెగావైద్య శిబిరాన్ని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవనాయుడు సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి మండల అధ్యక్షులు పెంకి వేణుగోపాలనాయుడు హాజరయ్యారు. గ్రామంలోని సాయిరాం మందిరం వద్ద నాయుడు డాక్టర్స్ ప్లాజా ఆధ్వర్యంలో జరిగిన మెగా వైద్యశిబిరంలో రామభద్రపురం ఎన్నారై వైద్యబృందం 198 మంది రోగులకు తనిఖీలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా పెంకి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు ఉపయోగించుకొని చిన్నచిన్న వైద్యానికి కూడా అధిక మొత్తంలో ప్రైవేటు హాస్పిటల్లో ఖర్చు చేయకుండా మన గ్రామం, మండలంలోకి అందుబాటులోకి వచ్చిన ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాపారావు, మల్లేష్, స్వామి, కాగాన బాబు రావు, వైద్యులు శ్రీను, కర్రి శ్రీను, అక్కపోలు సాయి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఆదివారం ఎక్సైజ్ సిబ్బంది జరిపిన దాడుల్లో తురకనాయుడువలస, కురుపాం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రెడ్డి జోగమ్మ నుండి 7 మద్యం సీసాలు, పొట్నూరు గుంపస్వామి నుండి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా నాటు సారా తయారు చేసినా, సారా, మద్యం తరలించినా, అమ్మినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడిలో ఎస్సై జె.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

11న ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- బొబ్బిలి

దేశంలో 78 లక్షల మంది ఇపిఎఫ్ పెన్షన్‌దారులకు దగా చేసిన కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా ఫిబ్రవరి 11 మంగళవారం విజయనగరం పిఎఫ్ ఆఫీసు వద్ద కనీస పెన్షన్ రూ.9వేలు కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని ఉచిత వైద్యం, రైల్వే ప్రయాణంలో వృద్ధులకు రాయితీ కల్పించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపడుతున్నట్లు ఎపిఆర్‌పిఎ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు పి శంకర్రావు, ఉపాధ్యక్షులు వి.శేషగిరి, టీబీ అప్పారావు, శంకర్రావు తెలిపారు. ఇపిఎఫ్ పెన్షన్‌దారుల కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అనేక ఆందోళనలు, నిరసనలు చేపడుతున్నప్పటికీ ఇపిఎఫ్ పెన్షన్‌దారులకు కనీస పెన్షన్ రూ.9వేలు పెంచడం లేదన్నారు. రాష్ట్రాలలో సామాజిక పెన్షన్ చెల్లిస్తున్నంత కూడా లేదని అన్నారు. జీవితంలో తనవాట, యాజమాన్యాల వాటా లక్షలాది రూపాయలు ఉంచుకొని వెయ్యి రూపాయలు మాత్రమే కనీస పెన్షన్ ఇవ్వడం ఇంతకంటే అన్యాయం మరొకటి లేదని అన్నారు. బిజెపికి మద్దతు ఇస్తున్న తెలుగుదేశం ప్రభుత్వం ఈ రాష్ట్రంలో ఉన్న 35వేల మందికిపైగా పెన్షన్ దారులపై కనీసం పార్లమెంట్‌లో మాట్లాడకపోవడం వీళ్ళ చేతగానితనంగా కనిపిస్తోందన్నారు. ఇపిఎఫ్ పెన్సన్ దారులందరూ ఫిబ్రవరి 11 విజయనగరం పిఎఫ్ ఆఫీసు వద్ద జరిగే ధర్నాలో పాల్గొవాలని కోరారు.

ప్రజ్ఞా వికాసం పరీక్ష విజయవంతం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రజ్ఞా వికాసం పరీక్ష విజయవంతమైంది. జిల్లా వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం మోడల్ టెస్ట్ నిర్వహించారు. వేలాది మంది విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నారు. ప్రశ్నపత్రాలను వన్‌టౌన్ సిఐ శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్, జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న పబ్లిక్ పరీక్ష కోసం విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. రామ్మోహన్ మాట్లాడుతూ మొదటిసారి పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఇది ఒక మోడల్ ఎగ్జామ్‌గా ఉంటుందని, విద్యార్థుల్లో ఉండే భయాన్ని పోగొడుతుందని తెలిపారు. సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రజ్ఞా వికాస పరీక్షలో జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి రూ.5 వేలు, 3 వేలు, 2 వేలు చొప్పున నగదు బహుమతులు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాము, సహాయ కార్యదర్శి రవి, జిల్లా నాయకులు రాజు, సూరిబాబు, సమీరా, జయ, ఎర్రమ్మ పాల్గొన్నారు.

బొబ్బిలి : పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజ్ఞా వికాసం ప్రశ్నాపత్రాలను పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షలకు సిద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రసన్నకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చినబాబు, జిల్లా సహాయ కార్యదర్శి కె.మణికుమార్, బొబ్బిలి మండల కార్యదర్శి కేశవ, మండల సహాయ కార్యదర్శి జానీ, మండల నాయకులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: స్థానిక చైతన్య డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రజ్ఞ వికాసం పరీక్ష పేపర్‌ను యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు జి. వెంకటరావు ఆవిష్కరించారు. ఈ ప్రజ్ఞ వికాస పరీక్షలలో అన్ని పాఠశాలలకు చెందిన 290 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఏ.అను, మండల గర్ల్స్ కో కన్వీనర్ రత్న, జిల్లా వైస్ ప్రెసిడెంట్ కె రమేష్, మండల కమిటీ సభ్యులు వి.చరణ్, రవి, శీల, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రాజాం: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం పేరుతో మోడల్ టెస్ట్ నిర్వహించారు. వందలాది మంది విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నారు. ప్రశ్నాపత్రాలను జిల్లా ఉపాధ్యక్షులు పి.రమేష్, జిల్లా కమిటీ కోగర్ల్ కన్వీనర్ బి.రూప చేతుల మీదుగా ఆవిష్కరించారు.

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్య?

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఉరివేసుకున్న రజని

వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం గుమ్మలక్ష్మీపురం మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని ఎల్విన్‌పేట గ్రామ శివారులో గల తోటలో వివాహిత జన్ని రజని (32) చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఆమె తమ సొంత తోటలోనే అనుమానాస్పద రీతిలో చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందింది. సంఘటన స్థలం వద్ద గుళికల మందును పోలీసులు గుర్తించారు. రజిని భర్త ఉదయ్ కుమార్ మన్యం జిల్లా కలక్టర్ కార్యాలయంలో రెవెన్యూ శాఖ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. రజని మరణం హత్యా, ఆత్మహత్యా అన్న కోణంలో ఎల్విన్ పేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఎల్విన్ పేట సిఐ హరి, ఎస్ఐ శివప్రసాద్ సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎల్విన్‌పేట ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

సైబర్ మోసానికి గురై యువకుడి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సైబర్ మోసానికి గురై గడ్డి మందు తాగి యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన పార్వతీపురం మండలం కోరిలో శనివారం రాత్రి జరిగింది. ఈ గ్రామానికి చెందిన రాయల శంకరరావు అనే వ్యక్తి ఎవరి వద్ద అయినా రూపాయి నోటు ఉంటే ఆ నోటుకు రూ.12 లక్షలు అంటూ సోషల్ మీడియాలో చూశాడు. ముందుగా రూ.2 లక్షలు కడితే రూ.12లక్షలు వస్తాయని సైబర్ నేరగాళ్లు నమ్మించారు. అది నమ్మి, బంధుమిత్రుల దగ్గర అప్పు చేసి మరీ చెల్లించాడు. ఆ తర్వాత అవతలి వారి నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో, మోసపోయానని గ్రహించి మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.